## క్లుప్తంగా

### విద్యార్థులకు రక్త పరీక్షలు



విద్యార్థినికి రక్త పరీక్షలు చేస్తున్న దృశ్యం

**కొలిమిగుండ్ల:** మండల పరిధిలోని చింతలాయి పల్లె ఉన్నత పాఠశాలలో సమత పౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. దాదాపు 300 మందికి రక్త పరీక్షలు చేయించామని పౌండేషన్ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి తెలిపారు. రక్తం పెరి గేందుకు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించామన్నారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బాలరాజు, పౌండేషన్ మేనేజర్ భాస్కర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రతిభ

**కోవెలకుంట్ల:** జిల్లాస్థాయి సైన్ ఎగ్జిబిషన్‌లో కోవెలకుంట్ల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రగతి విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎస్ఏ గఫూర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన చరణ్, మహమ్మద్‌ఉసేన్ ప్రదర్శించిన నమూనాలకు ప్రథమ స్థానం లభించిందన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో రాణించిన విద్యార్థులను హెచ్ఎం ఆరిఫాబేగం, సైన్స్ టీచర్ రేష్మా ప్రత్యేకంగా అభినందించారు.

### శివుడికి వెండి నామాలు వితరణ

**బనగానపల్లెరూరల్:** మండలంలోని పలుకూరులో వెలసిన శ్రీ రామేశ్వరస్వామి ఆలయంలో కొలువైన స్వామివారికి గ్రామానికి చెందిన సంగారపు రామయ్య మనువడు సింగారపు రాధాకృష్ణయ్య, శ్రీదేవి దంపతులు ఐదుతులాల వెండితో తయారు చేసిన మూడు శివనామాలను విరాళంగా అందజేశారు. వాటిని బుధవారం ఆలయ అర్చకులు భాస్కరయ్యకు దాతలు అందజేశారు.

### రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి

**కొలిమిగుండ్ల:** మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పెట్నికోట సమీపంలోని గుండుమల్లేశ్వరస్వామి ఆలయ క్రీడా మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఉదయ్‌భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 17,18 తేదీల్లో రాష్ట్ర స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. ఎర్రబోతుల సోదరుల ఆధ్వర్యంలో క్రీడాకారులతో పాటు ప్రజలకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు.

### వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం



సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

**బేతంచెర్ల:** పట్టణంలోని అమ్మవారిశాలలో బుధవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆర్యవైశ్య సంఘం వైభవంగా నిర్వహించారు.అర్చకుడు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుండా గోపాలు, బచ్చు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సోదరుడు

**ప్యాపిలి:** పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఆయన సోదరుడు వెన్నపూస నరేశ్ రెడ్డి కోరారు. బుధవారం ఆయన ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలతోపాటు సచివాలయాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చిలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

### మండల మీట్ వాయిదా

**అవుకు:** మండల కేంద్రం అవుకు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడిందని ఎంపీడీఓ అజాంఖాన్ తెలిపారు. 16 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే హాజరు కావడంతో వాయిదా వేశామని, త్వరలోనే మండల మీట్ నిర్వహిస్తామని ఎంపీడీఓ చెప్పారు.

## 'మల్లికార్జున స్వామి' రోడ్డు కళకళ

నాడు — గతంలో ముచ్చట్ల మల్లికార్జున స్వామి రహదారి



ప్రస్తుతం రూ. 3 కోట్లతో వేయించిన రోడ్డు — నేడు



**బేతంచెర్ల:** శైవ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన ముచ్చట్ల భ్రమరాంభ, మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు కళకళలాడుతోంది. గతంలో సరైన రహదారి లేక గతంలో భక్తులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. డోన్ రోడ్డులోని హెచ్ కొట్టాల గ్రామం క్రాస్‌రోడ్డు నుంచి మూడు కిలోమీటర్లు ఉన్న ఈ క్షేత్రానికి దాదాపు ఇరవై ఏళ్ల నుంచి సరైన రహదారి భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు. ప్రత్యేకించి కార్తీకమాసం, మహాశివరాత్రి పర్వదినాల్లో బేతంచెర్ల నుంచే కాకుండా డోన్, బనగానపల్లె ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల పాట్లు వర్ణానాతీతం. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేయించారు. 2021 అక్టోబర్ 24న ఈ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి బుగ్గన 2022 నవంబర్ 7వ తేదీన రోడ్డును ప్రారంభించారు. దీంతో రోడ్డు సౌకర్యవంతంగా మారింది. ప్రత్యేకించి శివరాత్రి ఉత్సవాలు ఈ నెల 18న ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులు రహదారి ఇక్కట్లు తప్పాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి బుగ్గనకు భక్తులతోపాటు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామరెడ్డి

**ప్యాపిలి:** అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉంటూ సమస్యలను పరిష్కరించాలని జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ గోకుల్ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి డోన్ మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు వివరించారు. అనంతరం జెడ్పీటీసీ, ఎంపీపీ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. బోర్లు మొరాయించినా, తాగునీటి పథకాలు పని చేయకపోయినా యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీలో అలసత్వం వహించరాదన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం కోట్లాదిరూపాయలు వెచ్చిస్తోందని, అయితే లక్ష్యాలను సాధించకపోతే ప్రయోజనం శూన్యం అన్నారు. మధ్యాహ్న భోజనం, ట్యాబులు, జగనన్న విద్యా కానుక వంటి పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీల్లో పట్టాలు పొందిన లబ్ధిదారులు ఇప్పటికీ ఇళ్ల నిర్మాణం ప్రారంభించకపోతే ఇంటి పట్టా రద్దు అవుతుందన్న విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, డిప్యూటీ తహసీల్దార్ మారుతి, ఎంఈఓ శ్రీనివాసులు, ఏఓ షేక్షావలి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శకుంతల, దేవకృపమ్మ, కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ రసూల్, సర్పంచులు మదన్‌మోహన్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

## మట్కారాయుళ్ల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ శేషయ్య

**డోన్ రూరల్ :** మట్కా రాయుళ్లను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ శేషయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నిందితుల అరెస్టు చూయించారు. సీఐ మాట్లాడుతూ స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వెనుకల మట్కా రాస్తూ, నాటు సారా అమ్ముతుండగా ఆరుగురు మట్కా రాయుళ్లను అరెస్టు చేశామన్నారు. పట్టణంలోని కొండపేటకు చెందిన చల్లా మధుమోహన్, చిగురుమాన్‌పేటకు చెందిన షేక్‌అబ్దుల్‌నభీ, కొత్తపేటకు చెంది కె.మధుగోపాల్, కొండపేటకు చెందిన మంగళి నరసింహులు, శ్రీరామనగర్‌కు చెందిన వేమవవు రమేష్‌తోపాటు కర్నూలు జిల్లా, కల్లూరు మండలం, ముజాఫర్ నగర్ కాలనీకి చెందిన కత్తి మధును అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి రూ. 1,02,000, 30లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

## 18 నుంచి సంస్థాన్‌లో శివరాత్రి ఉత్సవాలు



సంస్థాన్‌లో కొలువైన రామచంద్ర మాలిక్‌బాబా

**డోన్ :** అవధూత రామచంద్ర మాలిక్ బాబా సంస్థాన్ ఆధ్వర్యంలో శివరాత్రి ఉత్సవాలను వైభవంగా జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు సంస్థాన్ ప్రతినిధులు తెలిపారు. 18, 19వ తేదీలలో మహా మంగళహారతి, కాగడ హారతి, సంధ్య హారతులతో పాటు మాలిక్ బాబా, సాయిబాబా, పంచముఖ ఆంజనేయ స్వామి, దత్తాత్రేయ స్వాములవారికి అభిషేకాలు, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపడుతామన్నారు. 20వ తేదీన భజన పోటీలు, 21వ తేదీన బాబావారి పుణ్యతిథి పుష్పాలంకరణ, కేరళ వాయిద్యాలు, శివభక్తులు, గురవయ్యలతో మహా ప్రదర్శన ఉంటుందన్నారు. 22వ తేదీన ప్రముఖ గాయకురాలు ఆలూరు అనురాధ భక్తిగీతాలు, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర నాటకం ప్రదర్శన ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటలకు సాయి రామచంద్రమాలిక్ బాబా రథోత్సవం ఉంటుందన్నారు.

**భోగేశ్వరస్వామి ఆలయంలో...**

**బేతంచెర్ల:** మండల పరిధిలోని యంబాయి గ్రామంలో వెలసిన భోగేశ్వర స్వామి, నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి, సర్పంచ్ యుగంధర్‌రెడ్డి బుధవారం తెలిపారు. 18వ తేదీన నందికోల సేవతో ఉత్సవ విగ్రహముల ఉరేగింపు, స్వామి వారికి రుద్రాభిషేకం, 19న ఉదయం స్వామి, అమ్మవార్ల కల్యాణం, 20న స్వామి, అమ్మవార్లకు నిత్యపూజాదులు, 21న ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా వసంతోత్సవం నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

**17నుంచి పూదోట మఠంలో...**

**బేతంచెర్ల:** పట్టణంలోని పూదోట ఆశ్రమంలో వెలసిన భేతేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలను ఈనెల 17నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు బుధవారం తెలిపారు. 17వ తేదీ ఉదయం 10 గంటలకు శివలింగానికి సామూహిక అన్నాభిశేకం, 18న ఉదయం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు వేదపండితులు భక్తులతో అభిషేకాలు చేయిస్తారన్నారు. రాత్రి 1గంట నుండి 2:30 గంటల వరకు మృత్యుంజయ హోమం ఉంటుందని తెలిపారు. 19న తెల్లవారుజామున బ్రహ్మముహూర్తంలో 3:30 నుంచి 5 గంటల వరకు శివ పార్వతుల కల్యాణం కనుల పండువగా సాగుతుందన్నారు.

## ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని ఓబులరెడ్డి

**బనగానపల్లె:** గృహసారథులు, కన్వీనర్లు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి సూచించారు. మండలంలోని యర్రగుడి గ్రామ పంచాయతీ పరిధిలోని హుస్సేనాపురంలో బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు రామసుబ్బారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన గృహసారథులు కన్వీనర్ల సమావేశంలో కాటసాని ఓబులరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. మార్చి 18-26వ తేదీ వరకు చేపట్టనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు గడ్డం ఇదూర్‌సాహెబ్ నబీసాహెబ్, బాషా, నాగేషుడు, మల్లికార్జున, చాంద్‌బాషా, శంకరయ్య, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

**శ్మశానవాటిక పరిశీలన**

పట్టణంలోని తపాల శాఖ కార్యాలయం ప్రక్కభాగంలోని షియా మతస్తుల శ్మశానవాటికను కాటసాని ఓబులరెడ్డి పరిశీలించారు. షియామతస్తుల విన్నపం మేరకు ప్రహరీతోపాటు బోరును ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు అబ్దుల్‌ఫైజ్ ఎవరెస్టు బాబు, నవాబు జాన్, ఖానిక్, ఫిరోజ్, హసన్, మహమ్మద్, సాజిద్‌హుస్సేన్, అబ్బాస్, అలందారుహుస్సేన్, అలి, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ-క్రాప్ ప్రామాణికం



పంటల నమోదును పరిశీలిస్తున్న అధికారులు

**కోవెలకుంట్ల:** ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలకు ఈ-క్రాఫ్ ప్రామాణికమని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. బుధవారం మండలంలోని రేవనూరు రైతు భరోసా కేంద్రంలో ఈ- క్రాఫ్ సూపర్ వెరిఫికేషన్ చేపట్టారు. ఆర్‌బీకే పరిధిలో రైతులు సాగు చేసిన పంటల నమోదు వివరాలు, నీటివసతి, సాగుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుకృతి వైపరీత్యాల మూలంగా పంటనష్టం సంభవిస్తే ఈ క్రాప్ నమోదు ఆధారంగా నష్టపరిహారం, ఇన్సూరెన్స్ వర్తింపజేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తుల విక్రయానికి ఈ క్రాప్ తప్పని సరి అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాశాఖ టెక్నికల్ అసిస్టెంట్ అయూబ్‌బాషా, అసిస్టెంట్లు పాల్గొన్నారు.


## సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి



విశాలంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

**కొలిమిగుండ్ల:** మండల పరిధిలోని పెట్నికోటలో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ సామాజిక బాధ్యత కింద ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఉన్నత పాఠశాల నుంచి గుండుమల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని మలుపు వద్దకు 340 మీటర్ల మేర రోడ్డు ఏర్పాటు చేశారు. గ్రామాభివృద్ధిలో భాగంగా జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చొరవ తీసుకొని అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సీసీ రోడ్డు ఏర్పాటు చేయించారు. ప్రధాన రహదారి కావడంతో 7మీటర్ల వెడల్పుతో విశాలంగా వేశారు. రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ వేశారు. ఈనెల 17న రోడ్డును ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణం తరహాలో రోడ్డు విశాలంగా ఉండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబు



శ్రీ బుగ్గరామేశ్వరస్వామి ఆలయం

- 18 నుంచి బుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలు
- భక్తులకు వసతుల ఏర్పాట్లు చేస్తున్న కమిటీ సభ్యులు



బుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం



శ్రీ రాముడు వదలిన భాణంతో ఉద్భవించిన జీవజలం

**బనగానపల్లెరూరల్:** బుగ్గరామేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్నారు. శైవక్షేత్రాల్లో ప్రసిద్ధిగాంచిన మండలంలోని రామతీర్థం గ్రామంలోని శ్రీ బుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 18 నుంచి 20వ తేదీవరకు బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఈ మేరకు భక్తులకు అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నారు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 18 రాత్రి సాసవలి చిన్నమ్మ నాటక ప్రదర్శన ఉంటుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి రామకృష్ణ తెలిపారు. తెల్లవారు జామున 4.25 గంటలకు శ్రీపార్వతీ సమేత శ్రీబుగ్గరామేశ్వరస్వామి కల్యాణం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 19న ఆటల పోటీలు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం నందికోల సేవ, గ్రామోత్సవం, 20వ తేదీ రాత్రి నెల్లూరు కళాకారులతో పాట కచేరి ఏర్పాటు చేశామని ఆయన వివరించారు.

**ఆలయ చరిత్ర**

శ్రీ బుగ్గరామేశ్వరస్వామి దేవస్థానానికి శ్రీ రామచంద్రుడు అరణ్యవాసం చేసిన సమయంలో వచ్చారని నానుడి. ఆ రోజు శివరాత్రి కావడంతో సాయంత్రం స్నానం ఆచరించి శివుడికి పూజ చేయాలని తలంచారు శ్రీరాముడు. అయితే స్నానం చేసేందుకు నీరు లేక పోవడంతో భాణంతో భూమిలోని రాతి పొచ్చకు వదలగా జలం ఉద్భవించిందని చరిత్ర పేర్కొటుంది. ఆ కొలనులో శ్రీరాముడు స్నానం ఆచరించిన అనంతరం అక్కడి ఇసుక, నీటితో శివ లింగం ప్రతిష్ఠించినట్లు పూర్వికుల మాట. ఆ లింగం వద్ద రాత్రి జాగరణ చేసి మరుసటి రోజు ఉదయం శ్రీరామచంద్రుడు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు చరిత్ర అని ఆలయ అర్చకులు లక్ష్మీనరసయ్య తెలిపారు. శ్రీరాముడు ప్రతిష్ఠించిన ఆ శివ లింగమే నేడు శ్రీ బుగ్గరామేశ్వర స్వామి ఆలయంగా ప్రసిద్ధిగాంచింది. ఈ జీవబుగ్గలో నిత్యం నీరు వస్తునే ఉంటుంది. ఎంత నీటి కరువు ఉన్న ఈ జీవ బుగ్గలో మాత్రం నిత్యం నీరు వస్తునే ఉండడం ప్రత్యేకత.

### మహానందికి చేరిన పెళ్లిపెద్దలు

**మహానంది:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలో జరిగే శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారి కళ్యాణోత్సవానికి పెళ్లిపెద్దలైన శ్రీ పార్వతీ, బ్రహ్మనందీశ్వరస్వామి వార్లు బుధవారం రాత్రి మహానంది చేరారు. మహానందీశ్వర స్వామి దంపతులు సోమవారం నంద్యాలకు వెళ్లిన విషయం తెలిసిందే. పెళ్లిపెద్దలతో కలిసి మహానందికి చేరుకున్నారు. నంద్యాలలో ఇరువురు గ్రామోత్సవంగా పర్యటించి భక్తుల చేత పూజలందుకుని తిరిగి మహానందికి వచ్చారు. కల్యాణం, రథోత్సవం, తెప్పోత్సవం అనంతరం బ్రహ్మనందీశ్వర స్వామి దంపతులు నంద్యాలలోని ఆలయానికి వెళ్తారు.

**స్వామికి ముత్యాల తలంబ్రాలు**

మహాశివరాత్రి రోజున జరిగే స్వామి కల్యాణోత్స వానికి ముత్యాల తలంబ్రాలను హైదరాబాద్‌కు చెందిన భక్తుడు శ్రీనివాసగౌడు అందించినట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సుమారు రూ. 50వేల విలువైన అర కిలో ముత్యాలను పంపించినట్లు చెప్పారు.

### గాజులపల్లెలో చోరీకి యత్నం

**మహానంది:** గాజులపల్లెలోని శ్రీ వెంకటేశ్వర ఆలయం వద్ద నివాసం ఉంటున్న ఉపాధ్యాయురాలు కలర్స్ ఉమాదేవి ఇంట్లో బుధవారం చోరీ యత్నం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ప్రధాన ద్వారం వద్ద ఉన్న గడియను తొలగించి ఇంట్లోకి చొరబడ్డారు. రెండు బీరువాలు ఉండగా ఓ బీరువాను పగలగొట్టి చోరీకి యత్నించారు. సమీపంలో ప్రజలు గుర్తించి కేకలు వేయడంతో పరుగులు తీసినట్లు స్థానికులు తెలిపారు.

### 70శాతం సబ్సిడీపై ఫ్రూట్ కవర్లు

**డోన్ టౌన్:** ప్రకృతి వైపరీత్యాల నుంచి మామిడి పండ దిగుబడిని సంరక్షించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మామిడి సాగు చేసిన రైతులకు 70శాతం సబ్సిడీపై మ్యాంగో ఫ్రూట్ కవర్లను అందిస్తున్నట్లు వెంకటాపురం రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకుడు వెంకట్రాముడు తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కవర్లను ఉపయోగించడం ద్వార మామిడి పంటను ఆశించే తెనే మంచు, తామర పురుగు తదిరత కీటాకాల నుంచి రక్షణ ఉంటుందన్నారు. ఒక ఎకరాకు 4వేల కవర్లకు మొత్తం రు.8వేల రుపాయలు చెల్లిస్తే ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 70శాతం సబ్సిడీ మంజూరు చేసి తిరిగి రైతు ఖాతాలో రు.5600 లను జమ చేస్తుందన్నారు. ఒక రైతుకు గరిష్ఠంగా 10వేల కవర్లను అందించనున్నట్లు ఆయన తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### 20న మండల సర్వసభ్య సమావేశం

**కోవెలకుంట్ల:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశంలో విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, వ్యవసాయ, పశుపోషణ, గ్రామీణ గృహ నిర్మాణం, మాతాశిశుసంరక్షణ, రెవెన్యూ, వైఎస్సార్ క్రాంతి పథం, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలపై చర్చ జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు.

### గెలీలియో జయంతి

**డోన్ టౌన్:** పట్టణంలోని పాతపేటలోని వాసీజయలక్ష్మీ ఎయిడెడ్ స్కూల్‌లో టెలిస్కోప్ ఆవిష్కకర్త గెలీలియో జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గెలీలియో సేవలను హెచ్ఎం వీరారెడ్డి, సామాజిక కార్యకర్త, భ్రూణ హత్యల నివారణ కమిటీ సభ్యులు మహ్మద్‌రఫీ గుర్తు చేశారు.

### మహా రాజశ్రీ నంద్యాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు

E.P. No. 132/2019 in O.S.No. 319/2015

ఐరగం రామసుబ్బారెడ్డి తండ్రి లేట్ నాగిరెడ్డి, వయస్సు 72 సం॥లు, హిందూ, వ్యవసాయం, R/o ఇ.నెం. 2/21, ఏటూరు గ్రామం, R.S. కొండాపురం టౌన్, YSR కడప జిల్లా ..డిక్రీదారుడు

-Versus-

మొలక భాస్కర్‌రెడ్డి (died) his LRs
1. మొలక జయలక్ష్మీ భర్త లేట్ భాస్కర్‌రెడ్డి, వయస్సు 42 సం.లు,
2. మొలక రాజశేఖర్ రెడ్డి తండ్రి లేట్ భాస్కర్‌రెడ్డి, వయస్సు 22 సం.లు,
3. మొలక గురివిరెడ్డి తండ్రి లేట్ భాస్కర్‌రెడ్డి, వయస్సు 21 సం.లు,

All are R/o ఉమ్మాయిపల్లె గ్రామం, కొలిమిగుండ్ల మండలం, నంద్యాల జిల్లా ..ఋణగ్రస్తులు

**వేలం ప్రకటన**

పై నెంబరు అమలు అర్జీ నందు D.Hr. డిక్రీ అమౌంట్ రాబట్టుకొనుటకు ఋణగ్రస్తులు/ J.Drs పై దావా దాఖలు చేసి డిక్రీ పొంది దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని పైన కనపరిచిన కోర్టు నందు వేలంనకు తీసుకురావడమైనది. సదరు వేలము నందు కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఎవరైనను పాల్గొని కోర్టు వారి ఆంక్షల మేరకు వేలము జరుపుకొనవచ్చును. కావున సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిని కోర్టువారు 06-03-2023వ తేదీన పైన కనపరచిన కోర్టు నందు వేలము జరుగును. ఆసక్తి గలవారు వేలములో హాజరై దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలము జరుపుకొనవచ్చును అని కోర్టు వారి ఉత్తర్వులు మేరకు ఈ పేపర్ ప్రకటన ద్వారా ప్రకటించడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వేలం తేది: 06-03-2023 తదుపరి విచారణ తేది: 09-03-2023

**షెడ్యూలు:**

**ఐటమ్ నెం. 1:** కర్నూలు జిల్లా (ప్రస్తుతం నంద్యాల జిల్లా), బనగానపల్లె సబ్ రిజిస్ట్రేషన్, కొలిమిగుండ్ల మండలం, కోరుమానుపల్లె గ్రామ పరిధిలో (సర్వే నెంబర్: 440, విస్తీర్ణం ఎ. 4-06 సెంట్లు)
**హద్దులు: తూర్పు:** రామునాయక్ భూమి **పడమర:** బాలగురివిరెడ్డి భూమి **ఉత్తరం:** శ్రీనునాయక్ భూమి **దక్షిణం:** పెన్నా సిమెంట్ కంపెనీ వారు కొన్న ఓబులమ్మ మాన్యం
D.Hr. Value: Rs. 2,50,000-00 S.R.O. Value: Rs. 5,27,800-00
Amin Value: Rs. 20,30,000-00

**ఐటమ్ నెం. 2:** కర్నూలు జిల్లా (ప్రస్తుతం నంద్యాల జిల్లా), బనగానపల్లె సబ్ రిజిస్ట్రేషన్, కొలిమిగుండ్ల మండలం, తోల్లమడుగు గ్రామ పరిధిలో (సర్వే నెంబర్: 496, విస్తీర్ణం ఎ. 2-00 సెంట్లు మరియు సర్వే నెంబర్: 536, విస్తీర్ణం ఎ. 3-94 సెంట్లు)
**ఉమ్మడి హద్దులు: తూర్పు:** రస్తా **పడమర:** ఎస్.నారాయణరెడ్డి భూమి **ఉత్తరం:** ఎం.గంగిరెడ్డి భూమి **దక్షిణం:** ఆయకట్టు బంజారు
D.Hr. Value: Rs. 3,00,000-00 S.R.O. Value: Rs. 7,72,000-00
Amin Value: Rs. 19,70,000-00

జి.రామమోహన్‌రెడ్డి, వి.వి.క్రిష్ణారెడ్డి
D.Hr. పరం న్యాయవాదులు, సెల్: 82470 57011

## 'సహకార' సంఘం అధ్యక్షునిగా రంగనాథమయ్య



రంగనాథమయ్యకు డిక్లరేషన్ ఫారం అందిస్తున్న సర్పంచ్, అధికారులు

**డోన్ రూరల్ :** మండల పరిధిలోని తాడూరు గ్రామంలో బుధవారం పశువైద్య అధికారి డాక్టర్ నాగరాజు, ఎన్నికల అధికారి డాక్టర్ బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ ఆంజినేయస్వామి ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. గ్రామానికి చెందిన బి.రంగనాథమయ్య అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెక్రటరీగా బి.అంజనయ్య, కార్యవర్గ సభ్యులుగా హనుమంతు, సొంటి రాజయ్య, మల్లయ్య, రవికుమార్, లోకేష్ ఎంపికయ్యారు. అనంతరం ఎన్నికైన అధ్యక్షునికి గ్రామ సర్పంచ్ బంగారు జయచంద్ర, ఎన్నికల అధికారి డిక్లరేషన్ ఫారంను అందించారు.